


ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేటరూరల్:ఇస్సప్పాలెంలోని మహంకాళి ఆలయ నిర్మాణానికి పట్టణానికి చెందిన దొడ్డ రఘురామిరెడ్డి, శాంతకుమారి దంపతులు రూ.2.50,000 అందజేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్:నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 514.20 అడుగుల వద్ద ఉంది. ఇది 138.9118 టీఎంసీలకు సమానం.



కరపత్రాల ఆవిష్కరణ

ఇంద్రకీలాద్రి(విజయవాడ): ఇంద్రకీలాద్రిపై 8వ తేదీ నుంచి ప్రారంభం కానున్న శాకంబరీ ఉత్సవాల కరపత్రాలను ఆలయ ఈవో శీనానాయక్ సోమవారం ఆవిష్కరించారు.

చదువుకొనాలంటే కష్టాలే!



పిల్లల చదువులపై ఫీజుల పంజా

- విద్యా సామగ్రి పేరిట అదనపు వసూళ్లు
- ఫీజుల నియంత్రణపై దృష్టి కరవు
- విద్యాహక్కు చట్టం అమలుపై దృష్టి సారించని విద్యాశాఖ

చీరాల: తాము పడిన కష్టం పిల్లలు పడకూడదని, మంచి స్థాయికి రావాలని తల్లిదండ్రులు ఆశపడుతుంటారు. కన్నబిడ్డలను ఉన్నత చదువులు చదివేందుకు ఆరాటపడుతుంటారు. కొంతమంది తమ స్థాయికి మించి ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో చదివిస్తున్నారు. తల్లిదండ్రుల ఆరాటాన్ని ఆసరా చేసుకుని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫీజుల పేరుతో, విద్యాసామగ్రి పేరిట అందినకాడికి దోచుకుంటున్నారు. ఫీజుల కంటే ఇతర విద్యాసామగ్రి కొనుగోలు చేయాలంటే తలకు మించిన భారమవుతుంది. చదువుకునే రోజుల నుంచి చదువుకొనే పరిస్థితి నెలకొంది. ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో ఫీజుల నియంత్రణపై విద్యాశాఖ అధికారులు దృష్టి సారించకపోవడంతో ప్రైవేటు యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి.

ఇష్టానుసారంగా యాజమాన్యాలు

జిల్లాలో 300కి పైగా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలున్నాయి. గత ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ఎంతో ప్రాధాన్యమిచ్చి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీర్చిదిద్దారు. అవి నేడు కానరాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల బాటపడుతున్నారు. ఫలితాలు, ర్యాంకులను బేరీజు వేసుకుంటూ సామాన్య, మధ్యతరగతి ప్రజలు సైతం తమ పిల్లలను ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చేర్పించేందుకు మొగ్గుచూపుతున్నారు. దీనిని ఆసరాగా తీసుకుని ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. తమ పాఠశాలకు అత్యధిక మార్కులు వచ్చాయి, మా స్కూల్‌లో చేర్పిస్తే మీ పిల్లల భవిష్యత్ బాగుంటుందంటూ క్యాంపెయిన్ చేసి తల్లిదండ్రులను తమ వైపు తిప్పుకుంటున్నారు. కనీసం ఆట స్థలం కూడా లేకుండా ఇరుకు గదుల్లో, బహుళ భవనాల్లో పాఠశాలలను నిర్వహిస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. తల్లిదండ్రుల కమిటీలు కాగితాలకే పరిమితమయ్యాయి. వారు నిర్ణయించిన ఫీజులే చెల్లించాలని, వేరే వారి కంటే తామే తక్కువ తీసుకుంటున్నామని బురిడీ కొట్టిస్తున్నారు.

విద్యాహక్కు చట్టం అమలయ్యేనా?

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలో 25 శాతం ఉచిత విద్యనందించాలి. ఒకటో తరగతిలో ఉచితంగా ప్రవేశం కల్పిస్తే పదో తరగతి వరకు వెసులుబాటు ఉంటుంది. ఒకటో తరగతిలో అడ్మిషన్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ఆన్‌లైన్‌లో లాటరీ విధానంలో విద్యార్థులకు పలు పాఠశాలల్లో ప్రవేశాలు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ విధానం రెండు ఫేజ్‌లలో జరిగింది. జిల్లాలో మొదటి ఫేజ్‌లో 243 మంది దరఖాస్తు చేసుకోగా 169 మంది అడ్మిషన్లు తీసుకున్నారు. రెండో ఫేజ్‌లో 68 మందికిగాను 58 మంది అడ్మిషన్‌లు తీసుకున్నారు. ఇక్కడ ప్రభుత్వం కొంత మేరకు మాత్రమే ఫీజు చెల్లిస్తుంది. పూర్తిగా చెల్లించకపోవడంతో మిగిలిన డబ్బులు తల్లిదండ్రులు చెల్లించాల్సి ఉంది. అలానే బస్సు, పుస్తకాలు, యూనిఫాం, టై, బెల్టు, అదనపు తరగతులకు ప్రత్యేక ఫీజులంటూ బాదుడు షరా మామూలే. పలుకుబడి గట్టిగా ఉండి సిఫార్సులు ఉంటే అడ్మిషన్లు అవుతున్నాయనే ఆరోపణలు కూడా ఉన్నా యి. ఆర్టీఈ ప్రకారం అడ్మిషన్లు అనగానే యాజమాన్యాలు ఒకింత అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి. ఆర్టీఈ ద్వారా కొన్నేళ్లుగా ప్రైవేటు పాఠశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ చేపడుతున్నా వాటి వివరాలను మాత్రం గోప్యంగా ఉంచుతుంది. అడ్మిషన్ల సమయంలో హడావిడి చేసే విద్యాశాఖ అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత జిల్లాల వారీగా ఏయే పాఠశాలలో ఎన్ని ప్రవేశాలు కల్పించారనే వివరాలను మాత్రం వెల్లడించడంలేదు. విద్యాశాఖ అధికారులు కూడా ఆర్టీఈ సక్రమంగా అమలవుతుందా అనేది పరిశీలన చేయడం అవసరం.

విద్యాసామగ్రి పేరిట మరో దోపిడీ

ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో ఫీజులే ఎక్కువగా వసూలు చేస్తున్నారనుకుంటే విద్యాసామగ్రి పేరిట కూడా మరో దోపిడీ జరుగుతుంది. నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు సైతం తమ వద్దనే తీసుకోవాలని సూచిస్తున్నారు. పుస్తకాలు, ఇతర సామగ్రి విక్రయించవద్దని విద్యాశాఖ అధికారులు సూచిస్తున్న అవేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, యూనిఫాం, బెల్టు, టై, చివరకు పుస్తకాలు వేసే అట్టలు వంటి స్టేషనరీలను విద్యార్థుల తరగతిని బట్టి రూ.4 వేల నుంచి రూ.8 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఒకటో తరగతికి అవసరమయ్యే విద్యాసామగ్రి రూ.5 వేల వరకు అవుతుంది. మేము ఇచ్చే సామగ్రి బయట దొరకదని, మా వద్దనే కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. బయట కొనుగోలు చేస్తానంటే ఒప్పుకోని పరిస్థితి. దీంతో తల్లిదండ్రులపై మోయలేని భారం పడుతోంది.

అధిక ఫీజులపై ఫిర్యాదులొస్తే చర్యలు తీసుకుంటాం..

ప్రైవేటు పాఠశాలల్లో యూనిఫాం, పుస్తకాలు విక్రయించరాదు. అధిక ఫీజులు వసూలు చేసి, పుస్తకాలు, యూనిఫాం స్కూల్‌లోనే కొనాలని స్కూల్ యాజమాన్యం ఇబ్బంది పెడితే తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే వారిపై స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకుంటాం.

– డీ గంగాధరరావు, డిప్యూటీ డీఈఓ

గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేస్తాం..

పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభించిన మంత్రులు



జే.పంగులూరు: కూటమి ప్రభుత్వం పొగాకు రైతులకు అండగా, వారికి గిట్టుబాటు ధరను కల్పిస్తూ మార్కెఫెడ్ ద్వారా పొగాకు కొను గోలు చేస్తుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, గృహనిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి, కలెక్టర్ వెంకటమురళి అన్నారు. మండల పరిధిలోని మార్కెట్ యార్డులో నల్ల బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 18 పొగాకు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామ ని చెప్పారు. సోమవారం పంగులూరు, పర్చూ రు, ఇంకొల్లు మూడు కేంద్రాలు ప్రారంభిస్తున్నామన్నారు. రైతులు అధైర్యపడొద్దని, రైతు లు పండించిన పొగాకును పూర్తిగా కొనుగోలు చేస్తామన్నారు. మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రైతులు పండించిన పంటను అమ్ముకోలేని దీనస్థితిలో ఉన్నారన్నారు. పొగాకు కొనుగోలుకు ప్రభుత్వం రూ.270 కోట్లు కేటాయించిందన్నారు. అనంతరం మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ రైతులకు మంచి గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేస్తామన్నారు. రైతుల వద్ద ఉన్న చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తామన్నారు. పొగాకు సరుకును బట్టి రూ.6 వేలు నుంచి రూ.12 వేల వరకు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొన్నారు.

ఇంకొల్లు, పర్చూరుల్లో...

పర్చూరు(చినగంజాం): పర్చూరు నియోజకవర్గ పరిధిలోని ఇంకొల్లు, పర్చూరు మండలాల్లో పొగాకు కొనుగోలు కేంద్రాలను మంత్రులు కొలుసు పార్థసారథి, గొట్టిపాటి రవికుమార్‌లు సోమవారం ప్రారంభిచారు.

న్యూస్‌రీల్

నేడు హైకోర్టుకు జిల్లా కలెక్టర్

ఉత్తర్వులు జారీచేసిన న్యాయమూర్తి

బాపట్లటౌన్: బాపట్ల మండలంలోని ఆది ఆంధ్ర కో–ఆపరేటివ్ కలెక్టివ్ ఫార్మింగ్ సొసైటీ ఎన్నికలను నిలుపుదల చేసిన నేపథ్యంలో హైకోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను హైకోర్టు ఆదేశించింది. ఆది ఆంధ్ర సొసైటీ పరిధిలోని 1256 నుంచి 1278 వరకు ఉన్న సర్వే నెంబర్లలో 167 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ పరిధిలోని ఆది ఆంధ్ర సొసైటీకి జూన్ 19న ఎన్నికలు నిర్వహించాల్సిందిగా జిల్లా కలెక్టర్ వెంకటమురళి 2025 మే 9న ఉత్తర్వులు జారీ చేశారు. సొసైటీ పరిధిలోని సభ్యులు కాకుండా, సొసైటీతో సంబంధం లేని వ్యక్తులు, అక్రమంగా సొసైటీ సభ్యత్వం పొందిన వ్యక్తులు, ఈ భూములు ఆక్రమించుకొని సొసైటీ పేరుతో రుణాలు పొంది ఉన్నారని కలెక్టర్‌కు అనేక ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో జూన్ 19న జరగాల్సిన సొసైటీ ఎన్నికలను తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ జిల్లా కలెక్టర్ జూన్ 18న ఉత్తర్వులు జారీ చేశారు. సొసైటీ ఎన్నికల నిలుపుదలను సవాల్‌చేస్తూ పట్టణానికి చెందిన దగ్గుమల్లి జోసఫ్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసును విచారించిన హైకోర్టు న్యాయమూర్తి పూర్తి వివరాలతో జూలై 1న హైకోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.

రేపటి నుంచి ఇంటింటికి పర్యటన

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్



రేపల్లె: సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం ద్వారా బుధవారం నుంచి ఇంటింటికి పర్యటించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. సంవత్సర కూటమి పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని అన్నారు. ఏడాది కాలంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ రాబోవు రోజుల్లో ప్రజలకు కావాల్సిన సంక్షేమ పథకాలు, పనులను అడిగి తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లటం కార్యక్రమ ఉద్దేశమన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి కార్యకర్తల విస్తృత సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పంతాని మురళీధరరావు, రేపల్లె రామాంజనేయులు, కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, గోగినేని పట్టాభిరామారావు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో వచ్చే అర్జీలు పరిష్కరించండి

డీఆర్‌ఓ గంగాధర్‌గౌడ్



బాపట్ల: పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసిన ప్రతి అర్జీదారుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో డీఆర్‌ఓ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. పీజీఆర్ఎస్ పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. పోర్టల్‌లో 50 అర్జీలను ఇంత వరకు సంబంధిత అధికారులు చూడలేదని డీఆర్వో అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత శాఖాధికారులకు నోటీసులు జారీచేయాలని ఆదేశించారు. పరిష్కరించిన అర్జీలపై సమగ్రంగా ఆడిటింగ్ చేయాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు లిఖితపూర్వకంగా అధికారులకు వినతిపత్రాలను అందించారు. మా సమస్యలు పరిష్కరించాలంటూ అభ్యర్థించారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే పరిష్కరిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి హామీ ఇచ్చారు. గడువులోగా అర్జీలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో లేకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, సమగ్ర శిక్ష అభియాన్ అధికారి నాగిరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర జల శక్తి బృందం పర్యటన

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): కేంద్ర జల శక్తి శాఖ ద్వారా గుంటూరు జిల్లాలో అమలవుతున్న వివిధ పథకాల అమలు తీరును పరిశీలించేందుకు కేంద్ర జల శక్తి శాఖ అధికారులు కిరణ్‌కుమార్ కర్లప్ప, రేష్మ పిళ్లైలతో కూడిన అధికారుల బృందం సోమవారం జిల్లాలో పర్యటించింది. ముందుగా జిల్లా కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. అనంతరం గుంటూరులో అమృత్ పథకం ద్వారా చేపడుతున్న పనులను పరిశీలించారు.

పంచాయతీల్లో సమస్యలు పరిష్కరించాలి

- జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్
- కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందించిన నాయకులు



డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం నాయకులు


బాపట్ల/పర్చూరు(చినగంజాం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సోమవారం జిల్లా కేంద్రం బాపట్లలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకొని స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తూ కేంద్రం విడుదల చేస్తున్న నిధులను సైతం దారి మళ్లిస్తోందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులను అగౌరవపరుస్తూ చట్టాలను తుంగలో తొక్కుతున్నది వారు ఆరోపించారు. ఉపాధి హామీ పథకాన్ని టీడీపీ నేతలు కడుపు నింపుకునే జేబు సంస్థగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

ఉపాధి హామీలో పెద్దఎత్తున అవినీతి..

రాష్ట్రంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతిపై కేంద్ర ప్రభుత్వం తక్షణం విచారణ జరిపించాలన్నారు. చట్టం మేరకు ఉపాధి హామీ పనులను గ్రామ పంచాయతీల ద్వారానే జరిపించాలని, కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించాలని, సర్పంచ్‌లకు తల్లికి వందనం పథకం వర్తింపజేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఫైనాన్స్ కమిషన్ విడుదల చేసిన నిధులు రూ.1150 కోట్లు స్థానిక సంస్థలకు వెంటనే జత చేయాలన్నారు. బిల్లుల చెల్లింపులలో రాజకీయ జోక్యం నివారించాలని, 1320 మంది పంచాయతీ సెక్రటరీలను తక్షణమే పోస్టింగులు ఇచ్చి పెండింగ్‌లో ఉన్న 9 నెలలు జీతాలు విడుదల చేయాలన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీల గౌరవ వేతనాలు వెంటనే పెంచాలని, ప్రస్తుతం అమలులో ఉన్న గౌరవ వేతనాలను సకాలంలో చెల్లించాలని వారు డిమాండ్‌లను చేస్తూ వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో పర్చూరు నియోజకవర్గ పంచాయతీరాజ్ అధ్యక్షులు ఆసోది బ్రహ్మానందరెడ్డి, బాపట్ల నియోజకవర్గ అధ్యక్షుడు పీ ప్రసాద్, ఎం.ఏడుకొండలురెడ్డి, నాలుగు నియోజకవర్గాల పంచాయతీరాజ్ అధ్యక్షుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ జీ కృష్ణమూర్తి, ఉప్పుటూరు సర్పంచ్ యర్రాకులు తిరుమలేశ్వరరావు, ఎం హేమంత్‌కుమార్‌రెడ్డి, వీ గోపి తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన దేవదాయ శాఖాధికారి

రూ.60 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు



లంచం తీసుకుంటూ పట్టుబడిన దేవదాయ శాఖ ఈఓను విచారిస్తున్న ఏసీబీ అడిషనల్ ఎస్పీ

కొల్లూరు: లంచాల కోసం వ్యాపారులను వేధిస్తున్న దేవదాయ శాఖ ఉద్యోగి ఏసీబీకి చిక్కారు. ఏసీబీ అడిషనల్ ఎస్పీ మత్తే మహేంద్ర కథనం మేరకు... బాపట్ల జిల్లా కొల్లూరు దేవాలయాల సమూహ ఈఓగా పనిచేస్తున్న నాగిశెట్టి శ్రీనివాసరావు కొద్ది రోజులుగా ఆలయ దుకాణదారులను లంచాలు ఇవ్వాలని వేధింపులకు గురిచేస్తున్నాడు. కొల్లూరుకు చెందిన వంకాయల సాయి తన తండ్రి లక్ష్మీనారాయణ మరణించడంతో శ్రీ అనంతభోగేశ్వరాలయం పరిధిలో ఉన్న 6వ నంబర్ దుకాణాన్ని తన సోదరుడు రమేష్ పేరుమీదకు మార్చాలని శ్రీనివాసరావును పది రోజుల క్రితం కోరాడు. దుకాణం పేరు మార్పుకు రూ. లక్ష ఇవ్వాలని డిమాండ్ చేయడంతో, అంత మొత్తం ఇచ్చుకోలేనని తెలపడంతో రూ.70 వేలు చెల్లించాలని లేని పక్షంలో దుకాణం స్వాధీనం చేసుకుంటామని ఆలయ అధికారి హెచ్చరికలు చేశాడు. ఆలయ అధికారి అర్ధరాత్రి సమయాలలో సైతం ఫోన్‌లు చేసి లంచం నగదు కోసం వేధిస్తుండటంతో ఆయన అడిగిన మొత్తం సోమవారం ఇస్తానని సాయి ఒప్పుకొని ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. కొల్లూరులోని వేణుగోపాలస్వామి ఆలయంలోని ఈఓ కార్యాలయంలో దుకాణదారుడు సాయి ఏసీబీ అధికారుల సూచనల మేరకు ఈఓకు రూ.60 వేలు నగదు చెల్లింపులు జరుపుతుండగా, అకస్మాత్తుగా దాడులు నిర్వహించి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దుకాణదారుడి నుంచి లంచంగా తీసుకున్న రూ. 60 వేలు నగదును స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు, ఈఓ కార్యాలయంలోనే రసాయనాలతో పలు పరీక్షలు నిర్వహించి లంచం తీసుకున్నట్లు నిర్ధారించి దేవాదాయ శాఖాధికారి శ్రీనివాసరావును అదుపులోకి తీసుకున్నారు. ఈఓ శ్రీనివాసరావును మంగళవారం విజయవాడలోని ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు మహేంద్ర వెల్లడించారు. దాడులలో ఏసీబీ సీఐలు నాగరాజు, మన్మథరావు, సురేష్, సుబ్బారావు, ఎస్ఐలు చిట్టా ఉరుకొండ, సుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ రవాణా ఆపేవారేరీ?

గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు బేఖాతరు

- కృష్ణానది నుంచి రేయింబవళ్లు ఇసుక తవ్వకాలు
- రేపల్లె, గుంటూరు, తెనాలి ప్రాంతాలకు ఇసుక తరలింపు
- వందలాది ట్రిప్పర్లతో ఇతర ప్రాంతాలకు రవాణా
- అధిక ధరలకు ఇసుక విక్రయాలు
- పట్టించుకోని మైనింగ్, విజిలెన్స్
- నెల మామూళ్లతో సరిపెట్టుకొంటున్న అధికారులు



గాజుల్లంక వద్ద కృష్ణానది ప్రాంతంలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి,బాపట్ల: కృష్ణా నదిలో ఇసుక తవ్వకాలు జరగకూడదని గ్రీన్ ట్రిబ్యునల్ చెప్పింది. ఈ మేరకు గత నెల మధ్య నుంచి ఉత్తర్వులివ్వగా అక్టోబర్ వరకూ ఇవి అమలులో ఉంటాయి. అయినా సరే పచ్చ నేతలు ఆ ఉత్తర్వులను ఖాతరు చేయక నది నుంచి ఇసుకను తవ్వితీసి అక్రమ రవాణా చేస్తున్నారు. అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలతో అధికారిక తవ్వకాలు నిలువగా పచ్చనేతల అనధికార తవ్వకాలు, అక్రమ రవాణా మాత్రం యథేచ్ఛగా సాగుతోంది. కొల్లూరు మండలం గాజుల్లంక నుంచేకాక భట్టిప్రోలు మండలం పల్లెకోన, ఓలేరు, వెల్లటూరు దిగువ లంకల నుంచి అక్రమంగా ఇసుకను తవ్విపోసి గుంటూరు, రేపల్లె, తెనాలి, బాపట్ల ప్రాంతాలకు అక్రమరవాణా చేస్తున్నారు. టన్ను ఇసుక రూ.4 వేల నుంచి డిమాండ్‌ను బట్టి రూ.5 వేల వరకూ అమ్ముతున్నారు. రేయి పగలు తేడా లేకుండా అక్రమ రవాణా సాగుతోంది. నది నుంచి ట్రాక్టర్లతో ఇసుకను బయటకు తెచ్చి దానిని కుప్పలుగా పోసి ఆ తర్వాత డిమాండ్‌ను బట్టి ట్రిప్పర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నది పచ్చనేతలు కావడంతో అధికారులు అటు వైపు కన్నెత్తి చూసే పరిస్థితి లేకుండా పోయింది. అక్రమరవాణా జరగకుండా చూడాల్సిన మైనింగ్, విజిలెన్స్ అధికారులు నెల మామూళ్లతో సరిపెట్టుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి.

చీరాల నియోజకవర్గం నుంచి జోరుగా రవాణా

వేమూరు నియోజకవర్గంలోని కృష్ణానది నుంచే కాక చీరాల నియోజకవర్గంలోని చీరాల, వేటపాలెం మండలాల పరిధిలోని ప్రభుత్వ, అటవీ, అసైన్డ్ భూముల నుంచి ఇక్కడి పచ్చనేత ఇసుకను తరలించి పెద్దఎత్తున అక్రమార్జనకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ ప్రాంతంలో సముద్రతీరం వరకూ భూములన్నీ ఇసుక మయం కావడంతో పచ్చనేతకు పండుగలా మారింది. ఎక్కడికక్కడ ఇసుక భూములప్పగించి కొన్నిచోట్ల ట్రాక్టర్‌కు రూ.వెయ్యి చొప్పున వసూలు చేయగా మరికొన్ని చోట్ల టిప్పర్‌కు ఇంతని దండుకుంటున్నారు. మరికొన్ని క్వారీల నుంచి ఇసుక తరలించినందుకు నెలకు ఇన్ని లక్షలు అన్న పద్ధతిలో ఒప్పందాలు చేసుకొన్నట్లు సమాచారం. ఇటీవల బాపట్లకు చెందిన ఒక వ్యాపారి పందిళ్లపల్లి ప్రాంతం నుంచి ఇసుక అక్రమ రవాణా కోసం పచ్చనేతకు నెలకు రూ.30 లక్షలు కప్పం కట్టగా ఆ తర్వాత అంతకు మించి ఇస్తానంటూ చీరాల పచ్చనేత వద్ద ఉన్న మరో దందా నిర్వాహకుడు ఇసుక అక్రమ రవాణా బాధ్యతలు చేపట్టినట్లు పచ్చపార్టీలో ప్రచారం వుంది.



వేటపాలెం ప్రాంతంలో జేసీబీతో ఇసుక అక్రమంగా తవ్వుతున్న దృశ్యం

రోడ్డు నిర్మాణం పేరిట అనుమతులు

వాడరేవు–పిడుగురాళ్ల రోడ్డు నిర్మాణం పేరుతో అధికారుల నుంచి అనుమతులు పొందిన పచ్చనేత రోడ్డుకు కాకుండా ఇసుకను రిటైల్ వ్యాపారంగా మార్చి బాపట్ల, చీరాల ప్రాంతాల్లో భవన నిర్మాణాలతో పాటు వెంచర్లు, ప్లాట్ల చదునుతో సహా అవసరమైన వారందరికీ అధిక ధరలకు ఇసుకను అమ్మకానికి పెట్టి కోట్లు దండుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఇప్పటికే చీరాలతో పాటు వేటపాలెం నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి సదరు నేత ఇసుక అక్రమ తరలింపునే ప్రధాన వ్యాపారంగా మార్చుకున్నట్లు స్వపక్షం నుంచి విమర్శలు ఉన్నాయి.

వాన్‌పిక్ భూములను వదలట్లేదు..

వేటపాలెం మండల పరిధిలో ఉన్న సుమారు వెయ్యి ఎకరాల వాన్‌పిక్ భూముల నుంచి సైతం ఇక్కడి పచ్చనేత ఇసుకను తరలించడం చర్చనీయాంశంగా మారింది. వాన్‌పిక్ భూములన్నీ ఇసుకతో కూడుకున్నవే. కోర్టు వివాదాల నేపథ్యంలో ఆ భూములు పేరుకు వాన్‌పిక్ స్వాధీనంలో ఉన్నా భౌతికంగా రైతుల వద్దే ఉన్నాయి. మేము వచ్చిన తర్వాత భూములు స్వాధీనం చేసుకుంటామని అప్పటివరకూ భూములు మీ స్వాధీనంలోనే ఉంచుకొని సాగు చేసుకోమని వాన్‌పిక్ బచ్చులవారిపాలెం రైతులకు చెప్పింది. కానీ ఇక్కడి పచ్చనేతలు వాన్‌పిక్ భూములను వదలక వందలాది టిప్పర్లు పెట్టి రేయింబవళ్లు ఇసుక తరలించి అమ్ముకుంటున్నారు. అడ్డుచెప్పిన రైతులపైనా దౌర్జన్యం చేశారు. ఇవి వాన్‌పిక్ భూములని, వాటినుంచి ఇసుక అమ్ముకోవడం తమ హక్కు అన్నట్లు పచ్చనేతలు వ్యవహరించడం విమర్శలకు దారితీసింది. ఇక్కడే కాక నియోజకవర్గంలోని ప్రభుత్వ, అసైన్డ్, అటవీ భూములన్నింటి నుంచే సదరునేత ఇసుకను తవ్వి అమ్ముకోవడం ఇప్పుడు జిల్లాలో మరింత చర్చనీయాంశంగా మారింది.

క్లుప్తంగా

జాతీయ పురస్కారాలు ప్రదానం





సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన ఇరువురికి జాతీయ పురస్కారాలు ప్రదానం చేశారు. శ్రీ విఘ్నేశ్వర కూచిపూడి నాట్యాలయం, ఎంవీఆర్ కల్చరల్ అకాడమీ ఒంగోలు వారి సంయుక్త ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో వివిధ రంగాల్లో ప్రావీణ్యం గడించిన వారికి జాతీయ సేవా పురస్కారాలను ఈ నెల 29న ప్రదానం చేశారు. దీనిలో భాగంగా సత్తెనపల్లికి చెందిన పౌరాణిక రంగస్థల కళాకారుడు బెజగం రవికుమార్‌కి విశ్వవిఖ్యాత నట సార్వభౌమ నందమూరి తారక రామారావు నట కళారత్న జాతీయ పురస్కారం అందించారు. అలాగే సాహిత్య రంగంలో చేస్తున్న సేవలను, సామాజిక సేవలను గుర్తించి రచయిత్రి డాక్టర్ సరికొండ రమాదేవికి శ్రీ నందమూరి తారకరామారావు జాతీయ సాహిత్య సేవా రత్న అవార్డు, లిటిల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు అందించారు. ఈ సందర్భంగా ఇరువురిని ఘనంగా సన్మానించారు. వారికి పట్టణానికి చెందిన పలువురు కళాకారులు, సాహితీ ప్రియులు సోమవారం అభినందనలు తెలిపారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి



క్రోసూరు: ఇళ్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్ బిగించడానికి వస్తే వ్యతిరేకించాలని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు జి.రవిబాబు అన్నారు. సీపీఎం క్రోసూరు, అచ్చంపేట ప్రాంత కమిటీ సమావేశం సోమవారం రావెళ్ళ వెంకటేశ్వర్లు అధ్యక్షతన క్రోసూరు ఆమంచి భవన్లో జరిగింది. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ.. ప్రస్తుతం బాగున్న కరెంటు మీటర్ తొలగించి అదానీ కంపెనీ స్మార్ట్ మీటర్ బిగించడానికి సిబ్బంది వస్తారని, వారిని అడ్డుకోవాలని ప్రజలను కోరారు. ఈ మీటర్‌కు ముందే రీచార్జి చేసుకోవాల్సి వస్తుందని తెలిపారు. చేసుకోకపోతే కరెంట్ సరఫరా ఆగిపోతుందని తెలిపారు. రాత్రి 6 నుంచి 10 గంటల వరకు అధిక ధరలు వసూలు చేస్తారని పేర్కొన్నారు. విద్యుత్తు రంగం మొత్తం అదానీ కంపెనీ చేతుల్లోకి వెళుతుందని, అడ్డగోలుగా దోచుకునే అవకాశం ఉందని ఆరోపించారు. ఇలాంటి విధానాలను ప్రజలు వ్యతిరేకించాలని, పోరాటాలలో కలిసి రావాలని కోరారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు, మండల నాయకులు ఏపూరి వెంకటేశ్వర్లు, చిలక యేసయ్య, గంజిమాల ఎలిశమ్మ, ముత్యాల పౌలు, గర్నెపూడి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కాపరు తీగల దొంగలు అరెస్ట్



మాచర్ల రూరల్: ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ తీగలు దొంగిలిస్తున్న వారిని అరెస్ట్ చేసినట్లు గురజాల డీఎస్పీ బి.జగదీష్ తెలిపారు. సోమవారం రూరల్ పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆదివారం మధ్యాహ్నం వెల్దుర్తి ఎస్ఐ సమందర్ వలి, సిబ్బందికి వచ్చిన సమాచారం మేరకు శిరిగిరిపాడు ఫారెస్టు చెక్‌పోస్టు వద్దకు వెళ్లినట్లు తెలిపారు. దొంగలు పారిపోతుండగా పట్టుకొని విచారించటంతో వారు పలు గ్రామాలలో దొంగిలించిన కాపర్ వైర్‌ను విక్రయించినట్లు తేలింది. వీరంతా ఒంగోలుకు చెందిన మొగిలి నాగరాజు, గడ్డం బయన్న, ప్రతాప్ లక్ష్మి, దారల భవాని, దేవర అంజమ్మగా గుర్తించినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.50 వేల విలువైన కేబుల్ వైరు, సుమారు రూ.2.5 లక్షల విలువైన 308 కిలోల కాపర్‌ను రికవరీ చేశామన్నారు. పది కేసుల్లో నిందితులుగా ఉన్నారన్నారు. వెల్దుర్తిలో 13, మాచర్ల టౌన్ 1, రూరల్ 7, దుర్గి 17, కారంపూడిలో 4, విజయపురిసౌత్ 15, ప్రకాశం జిల్లా పుల్లలచెరువు 7, యర్రగొండపాలెం 3 పోలీసు స్టేషన్‌ల పరిధిలో వీరు ట్రాన్స్‌ఫార్మర్లను దొంగిలించినట్లు కేసులున్నాయన్నారు. వీరి వద్ద కొనుగోలు చేసిన వారిపైనా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో అర్బన్ సీఐ ప్రభాకర్‌రావు, రూరల్ సీఐ నఫీజ్ బాషా, ఎస్ఐలు సమందర్ వలి, అశోక్, సిబ్బంది దేవర నాయక్, విజయ్, వెంకట నాయక్ తదితరులున్నారు.

అర్జీదారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

ఎస్పీ తుషార్‌డూడీ



బాధితుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ



అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో నేలపు రామలక్ష్మి

బాపట్ల టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీదారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 49 మంది అర్జీదారులు వచ్చారు. బాధితుల సమస్యలు తెలుసుకున్న అనంతరం ఎస్పీ వారికి భరోసా కల్పించారు. జిల్లాలోని పోలీస్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. చట్ట పరిధిలో విచారించి గడువులోగా పరిష్కరించాలన్నారు. కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఆస్తి తగాదాలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీల మోసాలు వంటి సమస్యలే అధికంగా వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ జగదీష్ నాయక్, పి.జి.ఆర్.ఎస్. ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసరావు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై 10 అర్జీలు

రేపల్లె: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 10 అర్జీలు అందినట్లు ఆర్డీవో నేలపు రామలక్ష్మి చెప్పారు. స్థానిక కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించాక మాట్లాడారు. పట్టణంలోని 22, 23 వార్డులలో పందులు సంచరించడంతో సమస్యగా ఉందని ప్రజలు కోరారని పేర్కొన్నారు. ఓల్డ్‌టౌన్ అంకమ్మ చెట్టు సెంటరులో ట్రాఫిక్ సమస్యపై పట్టణాభివృద్ధి సంఘం కార్యదర్శి సీవీ మోహనరావు అర్జీ అందించారన్నారు. నేషనల్ హైవే నిర్మాణంతో స్థలం కోల్పోయిన తనకు నష్టపరిహారం అందించాలని పెనుమూడి గ్రామానికి చెందిన కృష్ణ కోరారని చెప్పారు. జగనన్న కాలనీలోని చర్చితో ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజలు అర్జీ ఇచ్చారన్నారు. ప్రజ్జం గ్రామంలో సాగునీరు అందించకుండా పలువురు అడ్డుపడుతున్నారని వెంకటేశ్వరరావు అర్జీ చేశారని చెప్పారు. భట్టిప్రోలు మండలం పెదలంకలో ఉన్న జగనన్న కాలనీలోని స్థలాల ఆక్రమణలను తొలగించాలని పెదలంక గ్రామానికి చెందిన నన్నెపాముల నాగేశ్వరరావు అర్జీ ఇచ్చారని వివరించారు. సిరిపూడిలోని తన పొలం హద్దులు చూపించాలని గొర్రెమూర్తి చిన్నారావు అర్జీ అందించాడన్నారు. జువ్వలపాలెంలో డ్రైనేజీ సమస్యపై ఆలూరి రామ్మోహనరావు అర్జీ అందించారన్నారు. కొల్లూరు పరిసర ప్రాంతాలలో అక్రమ ఇసుక రవాణా అరికట్టాలని జి.ప్రసాద్ ఫిర్యాదు చేశాడన్నారు. చోడాయపాలెంలోని తన భూమిని ఆన్‌లైన్ చేయాలని రేపల్లెకు చెందిన గాదె వెంకట నరసమ్మ అర్జీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. పరిశీలించి ఆయా శాఖల అధికారుల ద్వారా పరిష్కరిస్తామని ఆర్డీవో తెలిపారు.

వృద్ధాప్యంలో ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలి

మాజీ మంత్రి జాగర్లమూడి లక్ష్మీపద్మావతి



ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్జీఓల ప్రతినిధులు

చీరాల అర్బన్: వృద్ధాప్యంలో కూడా ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని మాజీ మంత్రి జాగర్లమూడి లక్ష్మీపద్మావతి అన్నారు. స్థానిక మహిళా మండలిలో నాలుగు రోజులుగా వృద్ధాప్య కేంద్రాల నిర్వహణపై నిర్వహించిన శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి హాజరై, ఆమె మాట్లాడారు. వృద్ధుల సేవలో మమేకం అయినప్పుడే మనం చేసే సేవ సార్థకం అవుతుందన్నారు. తన సుదీర్ఘ సేవా ప్రయాణం అత్యంత తృప్తి ఇచ్చిందన్నారు. శిక్షణ కార్యక్రమంలో హెరిటేజ్ ఫౌండేషన్ తరపున ప్రాజెక్టు హెడ్ టి.రవి మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను సమాజసేవకు కూడా ఉపయోగించాలన్నారు. శిక్షణ పొందిన వారిచే ప్రతిజ్ఞ చేయించి, సర్టిఫికెట్లు అందించారు. 18 సంస్థల బాధ్యులు, వారి సిబ్బంది తమకు స్ఫూర్తిగా నిలిచిన లక్ష్మీపద్మావతిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మహిళా మండలి మేనేజర్ శ్రీనివాసరెడ్డి, ఎన్జీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల నిరసన



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న కార్మికులు

రేపల్లె: తమ సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజినీరింగ్ అండ్ వర్కర్స్ యూనియన్ చేపట్టిన నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం రేపల్లె మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు కళ్లకు నల్లరిబ్బన్‌లు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ అధ్యక్షుడు డి.ప్రభాకరరావు మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం జీవో 36 ప్రకారం రూ.24,500 వేతనం అందించాలని, పీఆర్‌పీ అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. గతంలో సమస్యల సాధనకై నిర్వహించిన 17 రోజుల సమ్మె కాలానికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు జీవోలు విడుదల చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మణిలాల్, యూనియన్ నాయకులు రవి, రాఘవేంద్రరావు, శివ, యువరాజు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్

రేపల్లె: జగనన్న కాలనీలో సమస్యలు పరిష్కరించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు. పట్టణంలోని 18వవార్డు సమీపంలోని జగనన్న కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో కాలనీవాసులు సోమవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో చినుకు పడితే అక్కడ నడిచే పరిస్థితులు లేదన్నారు. దోమల బెడద అధికంగా ఉంటోందన్నారు. వర్షపు నీరు పోయే మార్గం లేదన్నారు. తాగునీరు రాకపోవటంతో దూరప్రాంతాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. పారిశుద్ధ్య లోపం ఉందని చెప్పారు. కొన్ని నెలల నుంచి ఈ సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు ప్రజాప్రతినిధులను, అధికారులను కోరినా ఫలితం లేదన్నారు. ఇక స్పందించకుంటే కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలు చేసేందుకు సైతం వెనకాడేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ కన్వీనర్ వి.ధనమ్మ, సభ్యులు కె.రవికుమార్, శ్రీనివాసరావు, వీరాంజనేయులు, ఫర్జానా, కనకదుర్గ, సీపీఎం నాయకులు ఆశీర్వాదం, అగస్టీన్, రమేష్, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కావడి సేవ



కావడి సేవలో భక్తులు

బాపట్ల: అత్యంత వైభవంగా శ్రీ సుబ్రహ్మణ్య స్వామి కావడి సేవా మహోత్సవం సోమవారం చేపట్టారు. బాపట్ల కోన కళాక్షేత్రంలో శ్రీ లలితా త్రిపుర సుందరీ పీఠం ఆధ్వర్యంలో ఉదయం కావడి సేవా మహోత్సవం, అభిషేకం, పుష్పయాగం, సర్పసూక్త హోమం నిర్వహించారు. నెమలికంటి హనుమంతరావు సారథ్యంలో ముత్తేవి శ్రీనివాస శశికాంత్ ఆధ్వర్యంలో ఉత్సవం చేపట్టారు. మేడూరి వెంకట అప్పలాచార్యులు, రొంపిచర్ల కేశవాచార్యులు, రొంపిచర్ల గోపాలచార్యులు, కొల్లిపర వెంకట శివ వర ప్రసాద్, శ్రీనివాసుల విఖనస మూర్తి, గూడా సాయి వెంకట్, భీమవరపు సురేష్ శర్మ సహకారంతో సుబ్రహ్మణ్య స్వామి వారికి విశేష అభిషేకం చేపట్టారు.

సుదీర్ఘ సేవలు అభినందనీయం



పదవీ విరమణ చేసిన పోలీసులను సన్మానిస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్ల టౌన్: జిల్లా పోలీస్ విభాగంలో పనిచేస్తూ పదవీ విరమణ చేసిన ఏఎస్ఐ దొరపల్లి శామ్యూల్, ఏఆర్ఎస్ఐ గంగవరపు విల్సన్ ఇస్సాక్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఉచిపెట్ల వెంకటేశ్వర్లు, హోం గార్డు గుద్దంటి జానకి రామయ్యలను సోమవారం ఎస్పీ తుషార్‌డూడీ సన్మానించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి.విజయసారథి, వెల్ఫేర్ ఆర్.ఐ మౌలుద్దీన్, ఎంటీ ఆర్ఐ శ్రీకాంత్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక సర్వీస్

యద్దనపూడి: ఉప్పరపాలెం గ్రామానికి చెందిన విద్యార్థుల ప్రయాణ సౌలభ్యం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ సర్వీసును సోమవారం అధికారులు ప్రారంభించారు. మండలంలోని ఉప్పరపాలెం నుండి లింగారావుపాలెం జెడ్పీ హైస్కూల్‌కు వయా వంకాయలపాడు, ఎడ్లపాడు, మైదవోలు మీదుగా నడిచే ఈ బస్సు ఏర్పాటు పట్ల ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం కేవీ రామిరెడ్డి, ఆర్టీసీ ప్రతినిధి ఆంజనేయులు మాట్లాడుతూ ప్రత్యేక సర్వీసు ఏర్పాటుకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సహకారం అందిచారన్నారు. కార్యక్రమంలో లింగారావుపాలెం ఎంపీటీసీ సభ్యులు తోకల వీరరాఘవయ్య, ఎస్ఎం కమిటీ అధ్యక్షులు షేక్ జాన్‌వలి, గ్రామపెద్దలు నంబూరు శివరామకృష్ణయ్య, రమేష్‌లు ఉన్నారు.

లింగ నిర్ధారణ సెంటర్లపై ప్రత్యేక నిఘా

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు



సమీక్ష సమావేశంలో సూచనలిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల టౌన్: ఆడ, మగ తేడాల లేకుండా సమానంగా చూసుకుకోవాలని.. లింగనిర్ధారణ చేయకుండా స్కాన్ సెంటర్లపై నిఘా ఉంచాలని చీరాల ఆర్డీఓ తూమాటి చంద్రశేఖర్‌నాయుడు సూచించారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సబ్ డిస్ట్రిక్ట్ పూర్వ గర్భ, ప్రసవ పూర్వ నియంత్రణ చట్టంపై సబ్ డిస్ట్రిక్ట్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆర్డీవోతోపాటుగా పోలీసు, రెవెన్యూ, వైద్యులు, ఎన్జీవోలు, ఇతర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆర్డీవో మాట్లాడుతూ లింగ నిర్ధారణ చేయడం, వెల్లడించడం చట్టరీత్యా నేరమన్నారు. సామాజిక సమతుల్యత, బాలికల జనన నిష్పత్తిని మెరుగుపరచాలన్నారు. లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఆడపిల్లల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని, ఆడ, మగ లింగ భేదం లేకుండా ఇద్దరిని సమానంగా చూడాలన్నారు. సమాజంలో జరుగుతున్న ప్రతి అంశాలను పిల్లలకు తెలియజేసి చైతన్య వంతులుగా చేయాలన్నారు. అబార్షన్లు లేకుండా చూడటం, ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్, స్కాన్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయకుండా కమిటీ సభ్యులు చూడాలన్నారు. అలానే భ్రూణ హత్యలు జరగకుండా, బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. చట్టాల ఉల్లంఘనలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆర్డీవో కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అడ్వయిజరీ కమిటీ చైర్మన్ డాక్టర్ రత్నమన్మోహన్, గైనకాలజిస్ట్ డాక్టర్ షణ్ముఖశ్రీ, డాక్టర్ యాకోబు, డాక్టర్ బ్రహ్మం, ఎన్జీవోలు, వైద్యులు డాక్టర్ సుభాషిణి, డాక్టర్ విజయ్‌కుమార్, రాజా సాల్మన్, మరియమ్మ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాన్ని నిరసిస్తూ ఆందోళన




కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న వామపక్ష పార్టీలు

బాపట్ల: మత్స్యకార ఉద్యమాలపై తప్పుడు ప్రచారాన్ని నిరసిస్తూ వామపక్ష పార్టీలు, మత్స్య కార్మిక సంఘాలు, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. 15 రోజులుగా మత్స్యకారులు తమ వృత్తికి అనుగుణంగా సహజసిద్ధంగా ఉన్న సముద్రం ముఖద్వారాన్ని పునరుద్ధరించాలని ఆందోళన చేస్తున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలో ఆందోళన నిర్వహించి కలెక్టర్‌ను కలిశారు. స్పందించిన కలెక్టర్ విచారణ కమిటీని నియమించారు. న్యూస్ చానల్స్, పత్రికా ప్రతినిధులు ఆక్రమణదారులకు అనుకూలంగా మత్స్యకార ఉద్యమానికి రాజకీయ రంగు పులుముతూ సమస్యను దారి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నాయని దుయ్యబట్టారు. వైఎస్సార్ సీపీ అండగా ఉండి ఉద్యమాన్ని నడుపుతుందనే ప్రచారాన్ని మత్స్యకారులు ఖండించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాబురావు మాట్లాడుతూ మత్స్యకార ఉద్యమం ప్రజా సంఘాలు, వామపక్షాల ఆధ్వర్యంలో నడుస్తుందన్నారు. సమస్యను పక్కదారి పట్టించడం కోసం కొన్ని చానల్స్ కొంతమంది పాత్రికేయులు తప్పుడు ప్రచారం చేస్తున్నారనన్నారు. కార్యక్రమంలో వాడరేవు సర్పంచ్ ఎరిపల్లి రమణ, మత్స్యకార జేఏసీ నాయకులు సైకం రాజశేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, సీపీఐ (ఎంఎల్ న్యూ డెమోక్రసీ) నాయకులు మేకల ప్రసాద్, మత్స్యకార సంఘాల నాయకులు పిక్కి శామ్యూల్ పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆచార్య లింగరాజు

ఏఎన్‌యూ: డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా యూనివర్సిటీ సైన్స్ ఫిజిక్స్ విభాగాధిపతి సీహెచ్. లింగరాజు నియమితులయ్యారు. వీసీ కె. గంగాధరరావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ జి. సింహాచలం సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా నియమితులైన లింగరాజుకు యూనివర్సిటీ ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ కళాశాల సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.









సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ 6 నెలల్లో any డిగ్రీ, PG, డిప్లొమా, B.tech, BAMS, BHMS, D. ఫార్మసీ, B. ఫార్మసీ, LLB, U.G.C యూనివర్శిటీస్ నుండి పూర్తిచేయండి. ✆ 99895 30727

REAL ESTATE

PLOT FOR SALE

■ నందనవనం @ చిలకలూరిపేట 500 గజాల స్థలము 3BHK ప్రీమియం విల్లాలు అన్ని సౌకర్యాలతో కేవలం 39లక్షల రూపాయలు మాత్రమే సంప్రదించండి. 7702787797, 9700565357

SERVICES

GOLD FINANCE

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర॥ ✆ 8790741166

WANTED

■ బోయపాలెంలో పనిచేయుటకు సె॥ ఆఫీసర్, గార్డ్స్ కావలెను. అ: డిగ్రీ, 12గం.-18000 అ:10th P/F 12గం.-13500. Ph: 95020 87373

■ ప్రముఖ ఇంటి ఆహార వాణిజ్య సంస్థ హోమ్ థాలి బాపట్లకు ఫుడ్ క్వాలిటీ చెకింగ్ & డెలివరీ ఎగ్జిక్యూటివ్స్ మరియు మహిళ ఎగ్జిక్యూటివ్స్ P/T F/T కావలెను. సంప్రదించండి. ఫోన్: 9888562228, 9381982818

■ గుంటూరు రైల్వేస్టేషన్ లోని వెలగపూడి ఎంటర్‌ప్రైజెస్ వారి One Station One Product జ్యూట్ బ్యాగ్ స్టాల్ నందు పనిచేయుటకు సేల్స్ పర్సన్స్ కావలెను. ఫోన్ నెంబర్: 97054 51537

■ NR Development companyకి మార్కెటింగ్ స్టాఫ్ మరియు మార్కెటింగ్ ఏజెంట్లు కావలెను. గృహిణులకు రిటైర్డ్ ఎంప్లాయిస్ కి ప్రాధాన్యత ఇవ్వబడును. 7702787797, 9700565357

■ ఓల్డ్ క్లబ్ రోడ్డులో అపిల్ డెంటల్‌లో పని చేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ జీ: 10,000, అసిస్టెంట్ జీ: 8500, ఓన్లీ లోకల్. 6302243437

■ A Collection Agency wants Banking & NBFC Field Executives & Lady Tele Callers in Guntur. DRA& Experience preferred. Ph: 9949972701, 9246066621

■ Wanted High School, Biology, Physics, Hindi, Social, PET, Computer Operator and mother teachers. Sri Vidhya High School, NGGO's colony, Gnt. 9701022900

■ Wanted Local, boys/girls for jewellery shop, experience in sales must., Contact: 9848333267

■ Wanted B-Pharmacy / D-Pharmacy candidates to work in a pharmacy in guntur pci registration mandator packing/Delivery boys. 6300975241

■ పెద కాకాని దగ్గర శంకర్ కంటి ఆసుపత్రి ప్రక్క న కన్‌స్ట్రక్షన్ సైట్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ (5 గురు) కావలెను. జీతం : 14 వేలు, 12 గం॥ డ్యూటీ. సంప్ర ✆ 93911 11702

■ Wanted experienced, dedicated & hardworking teacher's to teach nursery - 2nd class mother teachers - 6 members & 3rd - 8th class (all subjects) - 8 members. GKR High School, A.T. Agraharam, 9th lane, opp water tank Guntur. ✆ 9885028725, 9959127256

■ శ్రీ శాంతి హోమ్‌కేర్స్‌లో తెనాలి, గుంటూరు, రేపల్లె లో పనిచేయుటకు నర్సులు, కేర్‌టేకర్స్ కావలెను. జీ: 17000/- సంప్ర: 96184 85329

■ B.Ed చేసిన అనుభవం గల టీచర్స్ తెలుగు, మాథ్స్, ఇంగ్లీష్ & సోషల్ సబ్జెక్ట్స్ E.M బోధించుటకు కావలెను. 8886827278, 8886827279

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
గుంటూరు
7075167663
7075167541

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు వచ్చిన, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.